# గవర్నమెంటు గేదె

'తవరెప్పుడైనా గేదెలు పెంచారా? లేదా? మా ఇంటిదాని పోరుపడలేక ఓసారి ఈ గేదెల వ్యవహారంలో దిగి సాలా నష్టపోయానండి. మా మల్లేసుగాడు నన్ను నిలువునా ముంచేశాడండి!

మల్లేశంటే నాకు ఒరసకి బామ్మర్ది అవుతాడు. తెల్ల నిక్కరు, తెల్లసొక్కా మాయకుండా ఆడినీ ఈడినీ కొట్టుకు తినేసి బతికేస్తాడు. అదేంటోనండి - ఆడి సంగతి తెల్సుండి కూడా ఆడి బుట్టలో మాటిమాటికీ పడిపోతానండి.

ఓ రోజు పొద్దుటే అరుగుమీద కూర్చుని టీ తాగుతుంటే మల్లేసుగాడు 'ఏరా బావా' అంటూ వచ్చాడు.

'పొద్దుటే ఎవడి కొంప మునిగిందో - ఎక్కడికి బయల్దేరావు' అనడిగాను. 'నీ కొంపకే' అని నవ్వుతూ, 'నువ్వు తాగడవేనా - నాకూ టీ నీళ్ళు పోసేదేవైనా ఉందా?' అన్నాడు.

ఈ లోగా మాయావిడ, 'అరుగెక్కి సెంబుతో సెంబుడు టీ తాగడవేగాని, మా యన్నొస్తే మర్యాద సేద్దావన్న గేనం కూడా లేదు మనిషికి' అంటూ గ్లాసుతో టీ పట్టుకొచ్చింది ఆడికి.

'అదీ- అలా గెడ్డెట్టు బావకి' అంటూ జేబులోంచి రుమాలు తీసి, జాగ్రత్తగా మడతవిప్పి, అరుగుమీద పరచి, దాని మీద జాగ్రత్తగా కూర్చుని, గ్లాసు అందుకున్నాడు మల్లేసుగాడు. అందుకుని రెండు గుటకలేసి, 'టీ నీళ్లంటే సెల్లెమ్మ నిజంగా నీళ్ళే తీసుకొచ్చినట్టుందే' అన్నాడు ఆవదం తాగినోడిలా మొహం పెట్టి.

'పబ్లికుమీద గవుర్నరు అమ్మ మొగుడిలా బతికేసేవోడు - మీ యన్నకిల్లాంటి టీ నచ్చదు. ఇంకొంచెం పాలోసి తీసుకురాకపోయావా' అన్నాను నేను ఎటకారంగా.

'మరే - నువ్వు కొన్న గొడ్డిగేదె రోజుకు రెండు కుంచాల పాలిస్తోంది కదా' అంతకంటే ఎటకారంగా అంది మాయావిడ.

సాలాకాలం నుంచీ మాయావిడ ఓ గేదె కొనమని పోరెడుతోందిగాని ఇంతవరకు కొనడం పడనేలేదు. అందుకు ఆ ఎటకారవంతా.

కొంచెం సేపు మమ్మల్నిద్దర్నీ అలా ఫైటింగు సెయ్యనిచ్చి 'ఓ మంచి గేదుంది. కొంటావేంటి? సవకకూడా' అన్నాడు మల్లేసుగాడు మెల్లగా.

'ఎంతేంటి?' అంది మాయావిడ.

'ఎంతా - అయిదారొందలవుద్ది'

అయిదారొందల్లో గేదె అనగానే మాయావిడ కళ్ళు మిలమిలలాడిపోయాయి- 'బాబ్బాబు! అది కాయం జేసి పెడుదూ! పిల్లలు నీ పేరు చెప్పుకుని మజ్జిగనీళ్ళయినా తాగుతారు' అంది.

'బావ నోరిప్పడంలే' అన్నాడు మల్లేశుగాడు నాకేసి తిరిగి.

'అయిదారొందల్లో గేదేవొస్తుంది? గాడిదొస్తుంది'

'అది తర్వాత కొనుక్కుని ఎక్కి ఊరేగుదువుగాని ముందు గేదెకొను' అని నాతో అని, మల్లేశుగాడితో - 'మల్లేసన్నా! నువ్వే దగ్గరుండి బేరం కాయంజేసి గేదెని తోలించు. మీ బావ సంగతి నీకు తెల్సుకదా. లోకం తెలీని ఎర్రిమాలోకం' అని దేమేజింగుగా అంది మాయావిడ.

'నువ్వు ఏరే సెప్పాలా? నాకు తెలీదా సెల్లెమ్మా' - అంతకంటే దేమేజింగుగా అన్నాడు మల్లేశుగాడు.

'లోకం తెలీని ఎర్రిమాలోకాన్ని కాబట్టే లచ్మీదేవిలాంటి మాలచ్మినొదిలేసి లవ్వు, లవ్వని నిన్ను చేసుకున్నాను' అన్నాను నేను మాయావిడతో.

మాయావిడ నామాట విన్పించుకోనట్టు లోపలికెళ్ళిపోయింది. మల్లేశుగాడు లేచి, జేబురుమాలు తీసి, దులిపి, జాగ్రత్తగా మడతపెట్టి నిక్కరు జేబులో పెట్టి, నాకేసి తిరిగి, 'ఏడింటికల్లా రెడీగుండ్రా బావా - పాలెం వెళ్దాం' అని వెళ్ళిపోయాడు.

ఈ లోగా మాయావిడ పిడతల్లోనూ, డబ్బాలలోనూ, పెట్టెలోనూ దాచిన డబ్బంతా పోగుచేసి ఆరొందలిచ్చింది.

'ఇంత డబ్బెక్కడిదే' అన్నాను నేను ఆశ్చర్యపోయి.

'నీ మాలచ్మి ఇచ్చింది' అంది అది గీరగా.

ఏడింటికల్లా మల్లేశుగాడు సైకిలేసుకొచ్చేశాడు. మాయావిడ ఎయ్యి జాగ్రత్తలు చెబుతుండగా వెళ్ళి సైకిలెక్కి కూర్చున్నాను. వాడు పాలెం తీసుకెళ్ళి గేదెని సూపించాడండి.

'ఛ.... ఛ.... ఇదేం గేదెరా! ఇరవై రోజులు నిరాహారదీక్ష చేసినట్టు సచ్చేలా వుంది'

'అమ్మేవోణ్ణి సూడు! నలభైరోజులు నిరాహారదీక్ష చేసినోడిలా లేడూ? ఈ గేదెనమ్మేసి అరపుట్టి పుల్లలు కొనుక్కుని తిన్నగా స్మశానికెళ్ళిపోయి పేర్చుకు పడుకునేట్టున్నాడు. ఆడికే తిండిలేక పోతే గేదెకేవెడతాడు? గేదెలో డిఫెక్టు లేదు. ఓ నెలరోజులు బాగామేపి సూడు ఎలా ఉంటుందో – దాని పొదుగు సూశావా?'

'పొదుగు పెద్దదిగానే వుందిరా' అన్నాను నేను ఆశ్చర్యంగా.

'మరి తటపటాయించకు' అన్నాడు మల్లేశుగాడు.

ఆ గేదె ఆరొందలికి కొన్నాం సార్! మొదటి రోజు శేరు పాలిచ్చింది. రెండోరోజు తవుడూ, మూడోరోజు సోలెడూ, నాలుగో రోజు గిద్దెడూ – అయిదో రోజున సచ్చిపోయిందండి.

'ఒరే మల్లేసూ – ఇలాంటి గేదెని కొనిపెట్టావేంట్రా' అన్నాను వాణ్ణి నిలేసి.

'ఎవడి సావు ఎప్పుడు రాసిపెట్టుందో ఎలా తెలుస్తుంది? మన లక్కు అంతే, మనకి గేదెనమ్మినోడు ఇంకా బతికే వున్నాడు తెల్సా' అన్నాడు ఆడు.

'సచ్చిపోయే గేదె మాయన్న మాత్రం కొననిస్తాడా' అంది, మాయావిడ వాళ్లన్నకి సపోర్టుగా. గేదె సచ్చినా పాలమీద భ్రమ ఇంకాపోక, 'ఇదిగో – ఈ గొలుసమ్మేసి ఈసారి మంచి గేదె కొనుక్కురండి' అంది మాయావిడ మెళ్ళో గొలుసు తీసి ఇస్తూ.

'ఈసారి పాలెం గీలెం వద్దు. డైరెక్టుగా ఎడ్లబజారెల్లిపోదాంరా. ఒరే బావా! ఎప్పుడైనా ఎడ్లబజారు కెళ్ళావురా?'

'లేదు'

'ఎడ్లబజారంటే మాయా బజార్రా బావా! అడుగు పెట్టగానే బేరగాళ్ళు నిన్ను చుట్టుముట్టేస్తారు. నీ సూపు దేనిమీదైనా నిల్సిందా, అది కొనిపించేదాకా వదల్రు. ఆళ్ళ మాటల్లోపడిపోకు – జాగ్రత్త' అని ఆడు సెబుతుంటే నాకు గాబరాపుట్టి, 'అదంతా నువ్వే సూసుకోరా బామ్మర్దీ' అన్నాను నేను.

ఎడ్ల బజారులో పొద్దున్నుంచి మద్యాన్నందాకా ఈ గేదె కాదు ఆ గేదనీ, ఆ గేదె కాదు ఈ గేదె అని తిప్పి తిప్పి, సివరికి ఆడు దేన్ని కొనమంటే దాన్ని కొనేసే స్టేజికి నన్ను తీసుకొచ్చి – అప్పుడు సూపించాడు సార్ ఆ గేదెని.

సూడగానే కళ్ళు సెదిరిపోయాయంటే నమ్మండి. నూనె రాసారేమో– మదించిన ఏనుగులా నల్లగా నిగనిగలాడుతోంది. అది దున్నపోతయితే యమదర్మరాజుగారే దాన్ని తోలుకెల్లిపోయేవాడు – అంత క్లాసుగా వుందండి గేదె.

'ఒరే బావా' అన్నాడు మల్లేశుగాడు నన్ను ఓ కుదుపు కుదిపి.

నేనీ లోకంలోకి వచ్చి – 'ఎంతుంటుందిరా మల్లేశూ' అన్నాను ఆశగా.

నేను అలా అడుగుతుండగా ఆ గేదె చుట్టూ మూగినోళ్ళలో ఒకడు, 'ఆకరిమాట – ఆ పైది కాళీచేసి మూడు అయిదు తీసుకో' అన్నాడు.

'ఎల్లెల్లవయ్యా! నాలుగంటే ఇవ్వలా – ఇంకా కాలీ సెయ్యాలంట' అన్నాడు గేదెనమ్మేవాడు.

'మూడూ ఆరూ,' – ఇంకోడన్నాడు.

'ఓ పైసా తగ్గను'

'కొంటే ఇలాంటి గేదే కొనాలెహ – సచ్చే గేదెలెందుకు' అన్నాను రహస్యంగా మల్లేసుగాడి సెవిలో.

'నువ్వు కొంటానంటే బేరవాడదాం. ఆడు మనకు తెలుసున్నాడే' అన్నాడు మల్లేశుగాడు నా సెవిలో.

'సరే సూడు'

ఎవడైనా ఆ గేదెని ఏసుకుపోకముందే కొనేయాలనే ఆత్రతలో, అదంతా నన్ను గోతిలో దింపడానికి మల్లేశుగాడు చేసిన సెటప్పనే డౌటే రాలేదండి నాకు ఆ టైంలో.

మల్లేశుగాడు కదలగానే ఆడెనకాల మాయావిడ సెప్పిన ఎర్రి మాలోకంలా నేను ఫాలో అయ్యాను.

ఏంటి మల్లేసుగారూ, ఇలా వచ్చారన్నాడాడు. మంచి గేదేవన్నా వుంటే సూద్దావని, అన్నాడీడు. మీకా, అన్నాడాడు. నాక్కాదు, మా బావకి – కానీ నాకే అనుకుని సెప్పు, అన్నాడీడు. మీతో బేరాలేంటండీ, ఎంతోకొంతిచ్చి తోలుకుపోండి, అన్నాడాడు. మరీ బంగారంలా సెబుతున్నావు రేటు, అన్నాడీడు. బంగారమే కదండీ, అన్నాడాడు.

అలా ఆళ్ళిద్దరూ సరసాలాడి, సరసాలాడి, సివరికి మూడువేలకి సెటిల్ చేశారు.

'మల్లేసుగారు నాకు ఎయ్యికి బొక్కెట్టేశారు' అన్నాడు వాడు నేనిచ్చిన మూడు వేలూ పంచెని ముడేస్తూ.

సంతనుంచి గేదెని తోలుకొస్తుంటే ఊళ్ళో వాళ్ళ కళ్ళన్నీ దానిమీదే. అది మెల్లగా ఏనుగు నడిచినట్టు రోడ్డంతా ఆక్రమించి నడుస్తుంటే అందరూ 'ఇదెక్కడి గేదెరా' అని ఆశ్చర్యపోయారండి.

చీఫ్ మినిష్టరుగారు కాలవపక్క గెస్టుహౌసులో దిగినట్టు అది మా పాకలో దిగి సగమాక్రమించేసిందండి. మాయావిడ, ఊరోళ్ళ దృష్టి పోయేందుకు ఓ కిలోమిరపకాయలు దిష్టితీసి, దాని ముందు గెడ్డేసి, సెంబు తీసుకుని పాలు పితకడం మొదలు పెట్టింది. సెంబు నిండింది; గిన్నె నిండింది; స్టీలు బిందె నిండింది – సెబితే నమ్మరుగాని ఆ రోజు బకెట్టు పైన పాలిచ్చింది.

మాయావిడ ఆనందానికి పట్టపగ్గాల్లేవు. మూడు వేలు పోయినా బంగారం లాంటి గేదె వచ్చినందుకు నాక్కూడా సాలా సంతోషమేసింది. 'ఇన్నాళ్ళకి మా బామ్మర్దిదవ ఓ మంచిపని చేశాడు' అన్నాను మల్లేశుగాడి భుజం తడుతూ.

'మంచయినా, సెడయినా – అంతా మన లక్కు' అన్నాడు మల్లేశుగాడు.

ఆ రాత్రంతా మాయావిడ గంటగంటకి లేచి గేదె దగ్గర గెడ్డి పడేసి వచ్చింది. అది కూడా ఆపకుండా రాత్రి తెల్లార్లూ అలా నవులుతూనే వుందండి.

ఆ రాత్రంతా మాయావిడ మాట్లాడుతూనే వుంది. 'నువ్వు సిక్కిపోతున్నావు రోజూ పాలు తాగు' అంది నాతో. పిల్లలకి రోజూ పెరుగు పోస్తానంది. హోటలుకి కాతా ఎడదావంది. ఇల్లాంటి గేదెలు నాలుగు, ఇంటిపక్క మునిసిపాలిటీ కొళాయి ఉంటే ఇంక కనకవర్షవే అంది. ఎప్పుడు తెల్లారుతుందా, మళ్ళీ బకెట్టు పాలు ఎప్పుడు పితుకుదావా అనే ఆత్రంతో దానికి నిద్రేపట్టలేదు.

దాని మాటలు వింటూ నాకెప్పుడు కునుకుపట్టిందో తెలియదుగాని 'సచ్చాను బాబోయ్' అంటూ మాయావిడ పక్కమీదికొచ్చి పడేటప్పటికి మెలుకువొచ్చి, 'ఏవైందే' అన్నాను కంగారుగా.

'గేదె తన్నింది' అంది ఏడుస్తూ.

'నిన్న రాత్రి బాగానే పాలిచ్చింది కదే' అంటూ నేను వెళ్ళాను. "ఏహేయ్, ఏహేయ్" అంటూ దాన్ని ముద్దు చేసి, దాని ముందు ఇంకొంచెం గెడ్డేసి, పొదుగుమీద సెయ్యేశానోలేదో పెడీమని నన్ను కూడా తన్నింది. 'సంపేసిందేవ్' అంటూ నేనెగిరి మాయావిడ పక్కన పడ్డాను.

అయ్యా! అది ఇరవైనాలుగ్గంటలూ వాములు వాములు తినేసేది గాని పొదుగు మీద సెయ్యెయ్యనిచ్చేది కాదండి.

'ఏంట్రా మల్లేశూ - ఇది నన్నూ, నా ఫామిలీస్‌ని తినేసేలా వుంది కాని గిద్దెడు పాలివ్వడం లేదు' అన్నాను దిగులుగా మా మల్లేశు గాడితో, నాలుగు రోజుల తర్వాత.

ఆడు జాగ్రత్తగా కొంచెం దూరంలో నిలబడి గేదెని దీక్షగా చూసి, 'ఇది గవర్నమెంటు గేదెలాగుందిరా బావా' అన్నాడు.

'అదేంటి - నేనెప్పుడూ ఇన్లేదే'

'ఈ టైపు గేదెలు అయిదేళ్ళకోసారి పాలిస్తాయిరా! ఆ తర్వాత తినడవేకాని పాలివ్వు. ఎంతో కొంతకి వదుల్చుకోటం బెటరు. తిండి కర్చేనా తప్పుతుంది'

'మరి కొనేవాడు పాలు పితికి సూసి కొంటానంటే'

'ఆ భయం నీకక్కర్లేదు. ఓనరు మారినప్పుడల్లా ఓసారి పాలిస్తుందిలే - నీకివ్వలే?'

సివరికి ఎయ్యిరూపాయల నష్టానికి గవర్నమెంటు గేదె ఒదుల్చుకున్నానండి.

కాని మాయావిడ సెప్పేలోకం తెలీని ఎర్రిమొకాన్ని కదండీ - మల్లేశుగాడికి గేదె సంగతి ముందే తెల్సుననీ, వాడు రెండు పక్కలా కమీషను లాగేశాడనీ సాలా రోజుల వరకు తెలియలేదు. అది తెలిసాకా, దారికాపేసి ఆణ్ణి ఓ రోజు మునిమాపేళ పట్టుకున్నాను.

'ఏరా మల్లేశు - బావబావంటూ సచ్చే గేదెనీ, సావదన్నే గవర్నమెంటు గేదెనీ నాకంటగట్టి తెల్ల సొక్కాలేసుకు కులుకుతున్నావా?' అన్నాను కాలరుచ్చుకుని.

'ఏంటా మోటు సరసాలు - సొక్కా మాసిపోద్ది. వదులు' అని నా చేతులు సొక్కా మీంచి తప్పించి, మడత సరిచేసి, ఉఫ్ ఉఫ్ అని ఊది - 'అది సస్తాదని గాని, ఇది గవర్నమెంటు గేదని గాని నాకు ముందు తెలీదు - సత్తెపెమాణం. కమీషనంటావా - రెండు బేరాల్లోనూ మూడొందలు కూడా కిట్టలేదు. నా అర్జెంటు పన్లు వదులుకుని, నిన్ను సైకిలు మీద ఎక్కించి రిక్షా తొక్కినట్టు పాలెం, ఎడ్ల బజార్లు తిప్పినందుకయినా నాకు మూడొందలివ్వచ్చు. పోనీ అదీ ఇవ్వనంటావా? బావగారికి నేను ఆ మాత్రం పెట్టొచ్చు - తప్పులేదు. ఆ మూడొందలూ ఇచ్చేస్తాగాని గుహప్రవేశానికి నువ్వూ, సెల్లెమ్మా తప్పకుండా రావాలి,' అన్నాడు మల్లేశుగాడు.

'గుహప్రవేశవేంటి?'

'ఇల్లు కడతన్నాను'

'స్తలవేది?'

'స్తలం కొంటన్నాను'

'డబ్బేదీ?'

'ఇదిగో' అంటూ జాగ్రత్తగా నెత్తిమీద గంపదింపి దాన్ని కప్పిన టవలు తీసి సూపించాడు.

గంపలో వుందండీ కోడిపుంజు – పుంజంటే పుంజుకాదు – సీమ కుక్కంత వుందండి.

టవలు జాగ్రత్తగా కప్పి, 'చాలెంజి పుంజు – సిరంజీవిలాంటి – ఎదురు లేదు – వుప్పుడు కోడి పందేల దిబ్బ కెడుతున్నాను. మన తాలూకా వోల్ మొత్తం ఓ ట్రిప్పేసేనంటే ఇల్లేకాదు – కారుకూడా కొనేస్తా. అప్పుడు నిన్నూ, సెల్లెమ్మనీ బీవారం సినిమాకి కార్లో తీసుకెడతా'

'ఆ గంప అక్కడెట్టు' అన్నాను కరుగ్గా.

'ఆదేంటి? మా బావ అలా నక్సలైట్లా మాట్టాడతన్నాడు' అన్నాడు ఆడు తెల్లబోయి.

'ఆ మూడొందలకీ పుంజుకీ సెల్లు'

'సాలా అన్నేయం – మూడొందలిచ్చి నా స్టేటుబేంకుని కొనేస్తున్నావు,' అంటూ గోల పెట్టాడు మల్లేశుగాడు.

'నోగొప్పితే తంతా' అని ఆ గంపలాక్కుని కోడిపందేల దిబ్బకి బయలుదేరానండి.

కోడి పందేల దిబ్బ మీద మన పుంజుని బయటకి తియ్యగానే అంతా సైలెన్సయి పోయింది. పెట్రొమాక్సులైట్లు కళ్ళు పెద్దవిసేసి సూసాయి. జనం ఎవడికీ నోటమాట రాలేదు. మల్లేశుగాడు ఓ మూల దిగులు మొహం పెట్టి సైలెంటుగా సూస్తూ కూర్చున్నాడు.

'చాలెంజి రావుడొచ్చాడు – చాలెంజ్' అన్నాను పుంజును దింపి.

జనాల్లో మెల్లిగా కదలికొచ్చింది. క్షణంలో పందేలూ, పై పందేలూ వందల నుంచి వేలకెళ్ళిపోయాయి. మన పుంజు మీద పోటీ రావడానికి ఎవుడూ సాహసించలేదు. సివరికి ఓడు చాలెంజి అందుకుని ఆడి పుంజుని బరిలోకి దింపాడు.

ఆడి పుంజు ఈకలూడిపోయి సన్నగా, సచ్చేలా వుందండి. మన పుంజయితే దానికేసి సూణ్ణయినా సూళ్ళేదండి.

అయ్యా! రెండు పుంజుల్ని మూడుసార్లు ముక్కు ముక్కు తాకించి వదిలావండి. బక్కపుంజు వదిలీ వదలగానే కరాటీ కన్నడిలా గాలిలోకి ఎగిరి ఝుమ్మని ఎటాకిచ్చిందండి. అదింకా నేలమీద దిగకముందే మల్లేసుగాడి పుంజు మెరుపులా జనాల కాళ్ళలోంచి దారి చేసుకుంటూ సేలల్లోకి పరుగుతీసి, సీకట్లో మాయమై పోయింది.

మర్నాడు పొద్దుటే మాత్రం ఏం తెలీనట్లు, 'అదేంట్రా బావా! మన పుంజు అలా పారిపోయింది. బరిలో సచ్చినా బావుండేది. పలావు చేసుకుని తినేవోళ్ళం గదా' అని అవీ ఇవీ మాట్లాడి – 'ఒరే బావా! మల్లికపురం నుంచి గొల్లోడొచ్చాదురా. ఆడి దగ్గరుందిరా మేక – మేకంటే మేక కాదనుకో....'

అలో.... అలో.... అదేంటి సార్. అలా పారిపోతున్నారు? నంబరుగారి స్పీచి ఇందావని ఎలెక్షను మీటింగుకి మీరొస్తే రామాయణంలో పిడకలేటలా గేదెలు, కోళ్ళూ, మేకలూ అంటూ నా గోలేంటంటారా? స్టేజి మీద నెంబరుగార్ని సూడగానే మా గవర్నమెంటు గేదె గుర్తుకొచ్చి మొదలెట్టానండి....

ఏదో వానాకాలం సదువు సదివినోణ్ణి – మీలాగా యమ్మేలూ, బియ్యేలూ సదివినోళ్ళకి సెప్పదగినోణ్ణి కాదుకాని, ఎంత ఎర్రిమొకాన్నయినా యస్పీరియన్సు మీద నేను సెప్పేమాట తవరు ఆలకించండి. గవర్నమెంటు గేదెల్ని ఇల్లుగుల్ల చేసుకుని మేపితే మేపండి కాని పాలు మాత్రం ఆసించకండి – అడిగితే తన్నగలవు.

అబ్బే! ఇంక గేదె ఊసెత్తనండి. ఒట్టు – మీరు ఎల్లిపోకండి. మళ్ళీ అయిదేళ్ళకో, అర్ధాంతరంగానో కలుసుకుందాంగాని – మరినేవుంటా సార్!

*(ఆహ్వానం మాసపత్రిక, ఫిబ్రవరి 1995)*